# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-05-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణా జిల్లాలో జరిగే పింఛన్ల పంపిణీ, కార్మిక దినోత్సవం కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పాల్గొంటారు.**

**2. అమరావతి క్వాంటమ్ వ్యాలీలో 1,208 కోట్ల రూపాయలతో ట్విన్ ఆఫీస్ టవర్ల నిర్మాణ ప్రతిపాదనకు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ఆమోదం తెలిపింది.**

**3. తెలంగాణలో ఈ నెల 10 తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి వెల్లడించారు.**

**4. ఉత్తరాంధ్రను క్రీడా కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె రామ్మోహన్ నాయుడు తెలిపారు**

**5. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం "మే" డే ని ఈ రోజు జరుపుకుంటున్నారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణా జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పర్యటిస్తారు. జిల్లాలోని పామర్రు మండలం పమిడిముక్కలలో నిర్వహించే 'పేదల సేవ కార్యక్రమంలో భాగంగా ఫించన్ల పంపిణీలో పాల్గొని లబ్ధిదారులకు నగదు అందజేస్తారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అలాగే 'మేడే' సందర్భంగా భవన నిర్మాణ కార్మికులతో ముఖ్యమంత్రి ముఖాముఖి నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలు, సంక్షేమ చర్యలపై చర్చించనున్నారు. అనంతరం గుడ్లవల్లేరు లో నిర్మించిన ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేశామని మంత్రి కొలుసు పార్థసారథి తెలుపుతూ...

వాయిస్ 20 సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పలు శాఖల అధికారులతో కందుల దుర్గేష్, టి.జి.భరత్, గొట్టిపాటి రవి కుమార్, కొండపల్లి శ్రీనివాస్ తో కూడిన మంత్రుల బృందం నిన్న సమావేశమైంది. ఆంధ్రప్రదేశ్ లో 20 లక్షలకు పైగా ఉద్యోగాల కల్పన లక్ష్యంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని రాష్ట్ర మంత్రుల బృందం పిలుపునిచ్చింది. కొత్తగా ఉద్యోగాలు పొందిన వారి వివరాలను

ఒకే పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆ వివరాలు పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు – ఎంఎస్ఎంఈల ద్వారా ఉద్యోగాల సృష్టిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఉద్యోగ కల్పనకు సంబంధించి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

-------------------------

తెలంగాణలో ఈ నెల 10 తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ 7వేల 823 కోట్ల రూపాయలతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ..మే10వ తేదీ సాయంత్రం 4 గంటలకు పరేడ్ మైదానంలో భారీ సభ నిర్వహించనున్నామని చెప్పారు. ప్రధానమంత్రి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతోపాటు, కొన్ని ప్రాజెక్టులను తెలంగాణ ప్రజలకు అంకితం చేయనున్నారని జోగులాంబ, హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్లు, మల్కాపూర్‌లో నిర్మించిన పెట్రోలియం ఉత్పత్తుల టర్మినల్ వంటి వివిధ కార్యక్రమాలను దృశ్య మాధ్యమం విధానంలో ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నామని కేంద్ర మంత్రి వివరించారు.

-------------------------

అమరావతి క్వాంటమ్ వ్యాలీలో 1,208 కోట్ల రూపాయలతో ట్విన్ ఆఫీస్ టవర్ల నిర్మాణ ప్రతిపాదనకు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ఆమోదంతెలిపింది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం నిన్న సమావేశమయ్యింది. ఈ సమావేశ నిర్ణయాలను ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాత్రికేయులకు వివరించారు. ఢిల్లీలో రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా 11 ఎకరాల్లో నూతన ఆంధ్రప్రదేశ్ భవన్ నిర్మించాలని నిర్ణయించిందని తెలిపారు. అమరావతిలో నిర్మిస్తున్న సచివాలయం, కార్యాలయ విభాగాధిపతుల భవనాల పనులకు మంత్రి మండలి ఆమోదం తెలిపిందని మంత్రి తెలియజేస్తూ...

వాయిస్ 26 సెకన్లు

-------------------------

ఉత్తరాంధ్రను క్రీడా కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఉత్తరాంధ్ర క్రీడాభివృద్ధిపై విజయనగరం శాసన సభ్యులు అదితి విజయలక్ష్మి గజపతిరాజు, శాప్ చైర్మన్ రవి నాయుడు కేంద్రమంత్రితో నిన్న ఢిల్లీలో సమావేశమై చర్చించారు. ప్రభుత్వ -- ప్రైవేట్ భాగస్వామ్యంతో క్రీడా రంగాన్ని అభివృద్ధి చేసి, యువతకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలు కల్పించాలని కోరారు. క్రీడా రంగ అభివృద్ధికి కార్పోరేట్ సామాజిక బాధ్యత – సిఎస్ఆర్ నిధులు మంజూరు చేయాలని కేంద్రమంత్రికి వారు విజ్ఞప్తి చేశారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

-------------------------

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం “మే” డే ని ఈ రోజు జరుపుకుంటున్నారు. అమెరికాలోని చికాగో నగరంలో 1886 సంవత్సరంలో జరిగిన కార్మికుల ప్రదర్శన “ మే ” డే ఆవిర్భావానికి కారణమైంది. 1886 మే ఒకటవ తేదీన 8 గంటల పని విధానం కావాలని కోరుతూ, వేలాదిమంది కార్మికులు చికాగొలో పోరాటం ప్రారంభించారు. ఈ ప్రదర్శన ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో అనేకమంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మరణించిన వారి స్మృత్యర్థం ప్రతి ఏటా మే ఒకటవ తేదీన కార్మిక

దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

---------------------------

పోషకాహార ప్రాధాన్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పురోగతి వాటి పరిస్థితులపై బాపట్లలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సమీక్షా సమావేశంలో కలెక్టర్ వి.వినోద్ కుమార్ తో కలిసి నిన్న పాల్గొన్నారు. అనంతరం కార్పోరేట్ సామాజిక బాధ్యత కింద పలు సంస్థలు అందించిన పోషకాహార కిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ,

వాయిస్ 25 సెకన్లు

---------------------------

దేశవ్యాప్త జనగణన ప్రక్రియలో భాగంగా ఆంధ్రప్రదేశ్ లో ఈరోజు నుండి ఇళ్ల గణన ప్రారంభమవుతుంది. ఇందులో భాగంగా గణన అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల స్థితిగతులు, వసతుల వివరాలను సేకరిస్తారు. ఇళ్ల వసతులు, ఇతర వివరాలు వంటి అంశాలపై సుమారు 34 ప్రశ్నలు అడగనున్నారు. ఈ నెల 30 వ తేదీ వరకు ఈ మొదటి దశ గణన కార్యక్రమం జరగనుంది. ఇళ్ల జాబితా, గృహ గణన కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం కోసం జాతీయ టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్ నెంబర్ 1855కు ఫోన్ చేసి సమాధానాలు పొందవచ్చు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో కొన్ని ప్రాంతాల్లో ఎండతీవ్రత, మరికొన్ని ప్రాంతాల్లో వర్షాలతో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అంతర్గత కర్ణాటక నుండి తమిళనాడు మీదుగా సముద్ర మట్టానికి సగటున 0.9 కి.మీ ఎత్తులో ద్రోణి విస్తరించి ఉందని దీని ప్రభావంతో ఈ రోజు ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురంమన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, అనంతపురం, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరులో నిన్న అత్యధిక ఉష్ణోగ్రత 45.8 డిగ్రీలుగా నమోదైయిందని పేర్కొంది.

=====================